ప్రజాశక్తి
సోమవారం 2 జూన్, 2025
5
శ్రీకాకుళం

నేడు ప్రజా పరిష్కార వేదిక

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం: జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక సోమవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో వెల్లడించారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపి డాట్ జిఒ వి డాట్ ఇన్) వెబ్‌సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. అర్జీదారుల అర్జీల నమోదు, సమాధానాల గురించి తెలుసుకోవాలంటే 1100 నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు. అర్జీదారులు గమనించి సోమవారం నిర్వహించే మీకోసం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అదనపు 'టోల్' తీస్తున్నారా...?

- ఇటీవల లారీ డ్రైవర్లు సిబ్బంది మధ్య వాగ్వివాదం
- ప్రభుత్వమే నిర్వహించాలని అసోసియేషన్ డిమాండ్

ప్రజాశక్తి- పలాస

మండలంలోని జాతీయ రహదారి లక్ష్మీపురం సమీపంలో ఉన్న టోల్ గేట్ సిబ్బంది నిర్వాకం వల్ల లారీ డ్రైవర్లకు ఆశనిపాతంగా మారుతోంది. ఈ టోల్ గేట్ సిబ్బంది దురుసు ప్రవర్తన, లారీ డ్రైవర్లతో వాగ్వివాదాలు పెచ్చు మీరుతున్నాయి. లక్ష్మీపురం టోల్ గేట్‌కు రాను పోనూ 10 గేట్లు ఉన్నాయి. వీటి మీదుగా రోజూ నిమిషానికి 20 నుంచి 25 వరకు లారీలు వెళ్తుంటాయి. ఫాస్ట్ ట్రాక్ లేని లారీల డ్రైవర్లకు చుక్కలు చూపించడం సిబ్బందికి పరిపాటిగా మారింది. రాత్రి సమయాల్లో విధులు నిర్వహిస్తున్న టోల్ గేట్ సిబ్బంది ఆగడాలు మరీ మితిమీరి పోయాయని పలువురు లారీడ్రైవర్లు ఆరోపిస్తున్నారు. టోల్‌గేట్ వద్ద ఉన్న బరువుల మిషన్లలో తేడా రావడంతో బరువుతో ఉన్న లారీలను సిబ్బంది గేట్లను మార్చడం ఇక్కడ పరిపాటిగా మారింది. ఒక లారీకి సరుకు రవాణాకు సంబంధించి అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నా... టోల్ గేట్ సిబ్బందికి చేతులు తడపవలసిందే. లేదంటే ఆ లారీని అక్కడే నిలుపుదల చేస్తుంటారనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఇలాంటి సంఘటన లక్ష్మీపురం టోల్ గేట్ వద్ద ఇటీవల విజయవాడకు చెందిన లారీ ఐరన్ ప్లేట్ల లోడ్‌తో కాకినాడ వెళ్తుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లారీలో 36 టన్నుల 400 కేజీలు లోడ్‌తో వెళ్లాలి. అయితే ఐరన్ లోడ్ లారీలో లారీ బరువు పది క్వింటాల 800 కేజీల, 25 టన్నుల 293 కేజీలు మొత్తం 36 టన్నుల 96 కేజీల బరువుతో గమ్యానికి చేరుకుంటుంది. అప్పటికే టాటా నుంచి 9 టోల్ గేట్లను దాటి వచ్చింది. లోడ్ విషయంలో ఎటువంటి అభ్యంతరం లేకపోయినా లక్ష్మీపురం టోల్ గేట్ వద్ద మాత్రం సిబ్బంది అభ్యంతరం వ్యక్తం చేశారని లారీ డ్రైవర్ లంక రమేష్, క్లీనర్ లంక సురేష్‌లు ఆరోపించారు.

ఓవర్ లోడ్ లేదన్నా డబ్బులు కట్టి వెళ్లాలని, లేకపోతే డ్రైవర్లపై దాడులు చేయడం పరిపాటిగా మారిందని విమర్శలు వినిపిస్తున్నారు. ఏడాది కాలంగా ఇలాగే జరుగుతుందన్న విమర్శలు వనిపిస్తున్నాయి. లారీడ్రైవర్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లిన సందర్భాలు ఉన్నాయి. లోడుతో లారీ వెళ్తుంటే వేయింగ్ మిషన్ అధికంగా బరువు చూపిస్తుందని, నాలుగో గేటు ద్వారా వెళ్లాలని సిబ్బంది సూచిస్తున్నట్లు సమాచారం. వెనుక అనేక వాహనాలు బారులు తీరి ఉంటే డ్రైవర్ ఎలా వెళ్లారు. ఒకవేళ అధిక బరువు ఉంటే ఎదురుగా ఉన్న వేయింగ్ మిషన్ ద్వారా బరువును కాటా వేయించాలని డ్రైవర్లు కోరినా ఆ దిశగా సిబ్బంది చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. అధిక బరువులతో ఇసుక లారీలు టోల్ గేట్ మీదుగా వెళుతున్న వారిపై దృష్టి సారించని సిబ్బంది కేవలం లారీడ్రైవర్ల వద్ద డబ్బులు దండుకోవడానికేనని ఆరోపణలు ఉన్నాయి. ఒకవేళ అధిక బరువుకు డబ్బులు చెల్లించిన రసీదులు ఇవ్వరని, ఇలా చాలా లారీలకు జరిగాయని విమర్శలు వినిపిస్తున్నాయి. లారీల్లో లోడులకు ఏమైనా సమస్యలు ఉంటే కాటా పెట్టుకుని వసూలు చేసుకోవచ్చు. అలా కాకుండా అనవసరంగా లారీలను నిలుపుదల చేయడం చేస్తున్నారని లారీడ్రైవర్లు చెబుతున్నారు. పశ్చిమ బెంగాల్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన లారీలను ఈ విధంగానే ఆపి వేలాది రూపాయలు టోల్ గేట్ సిబ్బంది వసూలు చేస్తున్నారని లారీడ్రైవర్లు ఆరోపిస్తున్నారు. ఓవర్ లోడ్ లేకపోయినా ముందుగా డబ్బులు కట్టాలని డిమాండ్ చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

రాత్రి వేళల్లో...

లక్ష్మీపురం టోల్ గేట్ వద్ద రాత్రి వేళల్లో ఎక్కువగా లారీడ్రైవర్లకు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపణలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. లక్ష్మీపురం టోల్ గేట్ దాటి అటు ఒడిశా, పశ్చిమబెంగాల్, ఇటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, మహారాష్ట్ర, బీహార్, కర్ణాటక, జార్ఖండ్ తదితర రాష్ట్రాలకు నిరంతరం రాకపోకలు సాగిస్తారు. అయితే వారికి భాష ఒక సమస్యతే... రాత్రి వేళల్లో లారీలో పరిమితికి మించి లోడ్ ఉందని, అదనంగా డబ్బులు చెల్లించాలని టోల్ సిబ్బంది లారీడ్రైవర్లకు ఇబ్బందులు పెడుతున్నట్లు సమాచారం. ఒకవేళ డబ్బులు చెల్లించకపోతే లారీలను నిలిపి వేస్తున్నారని డ్రైవర్లు చెబుతున్నారు. ఎందుకు వచ్చిన సమస్య అని ఎక్కువ మంది డబ్బులు చెల్లించి వెళ్లిపోతున్నట్లు తెలుస్తోంది. లారీడ్రైవర్లు అదును చూసి ఇష్టానుసారంగా టోల్ వసూలు చేస్తున్నట్టు భోగట్టా. ధర్మ కాటాలో తేడా ఉందని పలువురు లారీడ్రైవర్లు చెబుతున్నారు. ఒక్కొక్క సమయానికి ఒక్కొక్కలా బరువు చూపిస్తుందని డ్రైవర్లు ఆరోపిస్తున్నారు.

ఇదే విషయాన్ని కాశీబుగ్గ సిఐ సూర్యనారాయణను వివరణ కోరగా, లక్ష్మీపురం టోల్ గేట్ వద్ద లారీడ్రైవర్లపై ఎవరైనా దాడి చేసిన, ప్రమాదం జరిగినా బాధ్యతగా సహాయ సహకారాలు అందిస్తాం. కానీ, టోల్ గేట్ సిబ్బంది అదనంగా డబ్బులు వసూలు చేస్తే మాకేంటి సంబంధం లేదు. అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారని హైవే అథారిటీ అధికారులు, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయాలి.

రూ.750లు అదనంగా తీసుకున్నారు

కర్ణాటక నుంచి ఒడిశా రాష్ట్రానికి పంచదార లోడ్‌తో వెళ్తున్నాం. లారీ పరిమితికి అనుగుణంగా బరువుతో వెళుతున్నా అదనంగా 500 కేజీలు బరువు ఉందని చెప్పి రూ.750లు వసూలు చేశారు. చాలా టోల్ గేట్లను దాటుకుంటూ వచ్చాం. ఎక్కడా అదనపు బరువు చూపలేదు. ఒక్క లక్ష్మీపురం టోల్ గేట్ వద్ద కాటా తేడా ఉంది. అందుకు కంప్యూటర్ కాటాలో 58360 టన్నులు బరువు ఉందని చూపిస్తే కంప్యూటర్ స్లీప్ 59250 టన్నులు బరువు ఉన్నట్లు చూపిస్తుంది. ఇందులో ఏది నిజమో తెలియదు. లారీ డ్రైవర్లు నుంచి ఇష్టానుసారంగా అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారు.

- హారిఫ్ ఖాన్, రాజస్థాన్, లారీడ్రైవర్

కుమ్మక్కయిపోయారు

లక్ష్మీపురం టోల్ గేట్ వద్ద ఇష్టానుసారంగా టోల్ వసూలు చేస్తున్నారు. అదనపు బరువు ఉందని వారికి నచ్చినట్లు లారీడ్రైవర్లు నుంచి డబ్బులు తీసుకుంటున్నారు. ఈ విషయంపై పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా... పట్టించుకోవడం లేదు. ఇటీవల ఒక లారీడ్రైవర్ వద్ద అదనంగా డబ్బులు ఇవ్వాలని టోల్ సిబ్బంది అడిగితే డబ్బులు ఇవ్వనందుకు సుమారు రెండు గంటలపాటు లారీని ఉంచారు. ఈ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేస్తే తిరిగి లారీకు రూ.1035లు రుసుం వసూలు చేశారు. టోల్ సిబ్బంది, పోలీసులు నిర్వాకంపై జిల్లా అధికారులు దృష్టి పెట్టి లారీడ్రైవర్లు నుంచి అదనంగా డబ్బులు వసూలు చేయకుండా చూడాలి. టోల్ సిబ్బంది పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

- బి.శేషగిరి, ఎపి న్యూ ఆంధ్రా మోటార్ ట్రక్కర్ అసోసియేషన్ జాయింట్ కార్యదర్శి

అదనంగా వసూలు చేయడం లేదు

లారీలో తరలిస్తున్న సరుకులు లారీ పరిమితికి మించి లోడ్ తీసుకు వెళ్తే కాటా ఆధారంగా డబ్బులు వసూలు చేస్తున్నాం. లారీడ్రైవర్లు నుంచి అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నామని మాటలో వాస్తవం లేదు. లారీలు వేగంగా వచ్చిన ఎక్కువ బరువు చూపిస్తుంది. లారీ డ్రైవర్లు ఛాలెంజ్ చేస్తే కాటా వేసి బరువు చూపించి డబ్బులు తీసుకుంటాం. అవసరమైతే తిరిగి డబ్బులు చెల్లిస్తున్నారు.

- ధనరాజ్, లక్ష్మీపురం టోల్ గేట్ మేనేజర్

బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నిర్వాసితులు

ఆఫ్‌షోర్ నిర్వాసితుల బైక్ ర్యాలీ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ఆఫ్‌షోర్ నిర్వాసితుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.సింహాచలం డిమాండ్ చేశారు. నిర్వాసిత గ్రామమైన చీపురుపల్లిలో ఆదివారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆఫ్‌షోర్ రిజర్వాయరు ప్రారంభించి 18 ఏళ్లు కావస్తున్న ప్రాజెక్టు పని నత్తనడకగా సాగుతోందని ధ్వజమెత్తారు. సకాలంలో ప్రాజెక్టు పూర్తి చేయకపోవడంతో నిర్వాసితులకు అన్యాయం జరిగిందన్నారు. నిర్వాసిత బాధితులకు భూ పరిహారాలు, ప్యాకేజీలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. నిర్వాసితులు దీక్షలు చేస్తున్నా అధికార యంత్రాంగంలో చలనం లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 18 ఏళ్ల నిండిన యువతకు ప్యాకేజీ మంజూరు చేయాలని, నిర్వాసితులందరికీ ఇళ్లు నిర్మించాలని అన్నారు. నిర్మాణం కోసం ఐదు సెంట్లు స్థలం ఇవ్వాలన్నారు. 2013 భూ సేకరణ చట్ట ప్రకారం భూములకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. హిరమండలం నిర్వాసితులకు ఇచ్చిన 460 జిఒ ప్రకారం పూర్తిస్థాయి ప్యాకేజీ ఇవ్వాలన్నారు. నిర్వాసితులందరికీ అంత్యోదయ కార్డుల మంజూరు చేయాలన్నారు. డీపట్టా భూములకు సొమ్ములు చెల్లింపుల్లో తేడాలు ఉన్నాయని, వాటిని సవరించి పూర్తి పరిహారం ఇవ్వాలని అన్నారు. ఈ నెల 5న తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. నిర్వాసితులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈశ్వరరావు, విజయకుమార్, కిరణ్, మాధవరావు పాల్గొన్నారు.

చంద్రబాబువి మోసపూరిత హామీలు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

చంద్రబాబు మోసపూరిత హామీలను ప్రజల్లో తీసుకెళ్లాలని ఉత్తరాంధ్ర కో-ఆర్డినేటర్, ఎమ్మెల్సీ కంభంపాటి రవిబాబు అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యకర్త సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సూపర్ సిక్స్ అంటూ హామీలు ఇచ్చి ఏడాది అయినా ఇప్పటి వరకు హామీలు అమలు చేయలేదన్నారు. దీంతో పేద ప్రజలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారమిస్తే సంపద సృష్టించి సంక్షేమ పథకాలు అమలు చేస్తానని ప్రసారం చేశారని విమర్శించారు. జిల్లాకు జగన్మోహన్‌రెడ్డి హయాంలో పలాసలో రూ.700 కోట్లతో కిడ్నీ ఆస్పత్రిని నిర్మించారని అన్నారు. టెక్కలి నియోజకవర్గంలో సుమారు రూ.4 వేలు కోట్లతో పోర్టు నిర్మాణం చేపట్టారని అన్నారు. అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపించారని కొనియాడారు. ఈ నెల 4న వెన్నుపోటు దినంగా ర్యాలీ నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్, జెడ్‌పిటిసిలు పాలవసంత రెడ్డి, దువ్వాడ వాణి, ఎంపిపి ప్రతినిధులు ఉమామహేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు హనుమంతు వెంకటేశ్వరరావు, సంపతరావు, హేమసుందరరాజు, బి.మోహన్, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రవిబాబు

రేషన్ డిపోలు పున:ప్రారంభం

ప్రజాశక్తి- జిల్లా విలేకరుల యంత్రాంగం

వికలాంగులకు, 65 ఏళ్లు పైబడిన వృద్ధులకు వారి ఇంటి వద్దకు రేషన్ డీలర్ వెళ్లి రేషన్ అందజేస్తారని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీకి అరసవల్లిలోని డిసియంఎస్ వద్ద గల రేషన్ షాపును ఆదివారం పున:ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ నెల నుంచి నిత్యావసర సరుకులను రేషన్ దుకాణాల ద్వారా రేషన్ కార్డు దారులకు అందిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 6,60,000 రేషన్ కార్డులు ఉండగా, 1603 ఎఫ్‌పి షాపుల ద్వారా డీలర్లు నిత్యావసర సరకుల సరఫరా చేస్తారని చెప్పారు.

శ్రీకాకుళం రూరల్ మండలం బారుర్లపేట, కిల్లిపాలెం గ్రామాల్లో రేషన్ షాపులను జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ప్రారంభించి లబ్ధిదారులకు సరుకులను పంపిణీ చేశారు. లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ముందుగా తూనికయంత్రాలు పరిశీలించి ఏర్పాటు చేసినట్లు వివరించారు.

లావేరు మండల హెడ్ క్వార్టర్‌లో రేషన్ డిపో ద్వారా సరుకులు పంపిణీని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు పున:ప్రారంభించి లబ్ధిదారులకు సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల ముప్పిడి సురేష్, తోటయ్యదొర, మీసాల వెంకటరమణ, పిన్నింటి మధుబాబు పాల్గొన్నారు.

కవిటి రేషన్ షాపు-2లో ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ రేషన్ డిపోను పున:ప్రారంభించి సరుకులను పంపిణీ చేశారు.

ఆమదాలవలస మున్సిపాలిటీలో శివన్నారాయణ క్వార్టర్‌లో ఎమ్మెల్యే, రాష్ట్ర పియుసి చైర్మన్ కూన రవి కుమార్ రేషన్ షాపును పున:ప్రారంభించి కార్డుదారులకు సరుకులను పంపిణీ చేశారు. మండలంలోని గాజులకొల్లి, సరుబుజ్జిలి మండలంలో పెద్దపాలెంలో రేషన్ డిపోను పున:ప్రారంభించారు.

పోలాకి మండలం రాళ్లపాడు పంచాయతీలో రేషన్ డిపోను ఎమ్మెల్యే బొగ్గు రమణమూర్తి పున:ప్రారంభించి కార్డుదారులకు రేషన్ పంపిణీ చేశారు.

నగరంలోని నక్కవీదిలో రేషన్ డిపోను ఎమ్మెల్యే గొండు శంకర్ పున:ప్రారంభించారు. కార్యక్రమంలో నగర కార్పొరేషన్ కమిషనర్ ప్రసాదరావు పాల్గొన్నారు. అలాగే స్థానిక రాయివీధి, బొందలీపురం వీధిల్లో రేషన్ డిపో పునప్రారంభించి కాన్సర్ బాధితుని ఇంటి వద్దకు వెళ్లి రేషన్ అందించారు. అలాగే స్థానిక అరసవల్లి రేషన్ డిపో పునప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మాదారపు వెంకటేష్ పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్

టెక్కలి పెద్దబ్రాహ్మణ వీధిలో రేషన్ డిపోను ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి పున:ప్రారంభించారు. అనంతరం డీలర్ కిమిడి శ్రీనివాసరావుకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరి, తహశీల్దార్ రవికుమార్, సివిల్ సప్లయ్ డిటి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న జెసి

రేషన్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

రేషన్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

రేషన్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

రేషన్‌ను పంపిణీ చేస్తున్న విప్ అశోక్

క్రీడాస్ఫూర్తిని కొనసాగించాలి

జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్

శ్రీకాకుళం: క్రీడా స్ఫూర్తిని జర్నలిస్టులు కొనసాగించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద ఖాన్ అన్నారు. ఈ నెల 2 నుంచి 4 వరకు గుంటూరులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి మీడియా క్రికెట్ పోటీలకు జిల్లాకు చెందిన జర్నలిస్టులు ఆదివారం సాయంత్రం బయలుదేరారు. ఈ వాహనాన్ని తన బంగ్లా వద్ద జెసి జెండా ఊపి ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కీర్తిని రాష్ట్రస్థాయిలో జర్నలిస్టులు చాటాలని, గెలుపోటములతో పాటు క్రీడా స్ఫూర్తి, క్రమశిక్షణ అవసరమన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, డిఐపిఆర్‌ఒ కె.చెన్నకేశవరావు, డివిజనల్ పబ్లిక్ రిలేషన్ అధికారి నత్తల రాజు, జర్నలిస్టు సంఘాల నాయకులు కొంక్యాన వేణుగోపాల్, ఎస్.జోగినాయుడు, జి.షణ్ముఖరావు, టీమ్ మేనేజర్ పక్కి వేణు, కెప్టెన్, వైస్ కెప్టెన్ సీపాన రమేష్, కె.శివశంకర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

జెండా ఊపి ప్రారంభిస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్

రూ.పది లక్షలు పరిహారం చెల్లించాలి

పరామర్శిస్తున్న సంఘ నాయకులు

శ్రీకాకుళం : పిడుగుపాటుకు గురై మృతి చెందిన కౌలు రైతు కుటుంబానికి రూ.10 లక్షలు పరిహారం చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలని కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ, నాయకులు తులగాపు ధనుంజయరావు డిమాండ్ చేశారు. సరుబుజ్జిలి మండలం బుడ్డివలసకు చెందిన కౌలు రైతు బూరడ అప్పలనాయుడు శనివారం పొలం పనిచేస్తుండగా పిడుగు పాటుకు గురై మృతి చెందారు. ఈ మేరకు శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రి వద్ద పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించారు. అప్పలనాయుడు గత కొన్నేళ్లుగా ఐదెకరాలు భూమి కౌలుకు సాగుచేస్తున్నారని, పంటలు గిట్టుబాటు కాక అప్పులు చేసి వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. ఆయన కుటుంబానికి వేరే ఆధారం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు త్వరగా స్పందించి కౌలు రైతు కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. పరామర్శ చేసిన వారిలో వాడవలస వాసు, తులగాపు మధు, ఎ.పాపారావు, శేఖర్, కె.గోవిందరావు, రమణ ఉన్నారు.

నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండి, నేర ప్రవృత్తికి స్వస్తి పలికి, సత్ప్రవర్తనతో నడుచుకోవాలని జిల్లాలోని రౌడీ షీటర్లలకు పోలీసు అధికారులు సూచించారు. ఆదివారం రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు నేరాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, ఘర్షణలకు దూరంగా ఉండాలన్నారు. ఎటువంటి అసాంఘిక కార్యక్రామాల్లో పాల్గోరాదన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతిఒక్కరూ చెడు వ్యసనాలను దూరం చేసుకుని మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఎటువంటి కారణాలు లేకుండా ఘర్షణలు సృష్టించినా వారిపై పోలీస్ నిఘా ఉంటుందన్నారు. గొడవల్లో, ఇతర నేరాల్లో పాల్గొంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

నేర నియంత్రణకు చర్యలు

జిల్లా విలేకరుల యంత్రాంగం: నేర నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలు అరికట్టే చర్యల్లో భాగంగా శ్రీకాకుళం రూరల్, సోంపేట, మెళియాపుట్టి పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఆదివారం తెల్లవారుజామున కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ మేరకు విస్తృతంగా తనిఖీలు చేశారు. ఈ క్రమంలో గంజాయి, మద్యం, నిషేధిత పదార్థాలు, నాటుసారా, అపరిచిత వ్యక్తులను గుర్తించేందుకు ఆకస్మిక తనిఖీలను చేపట్టారు. అణువణువూ క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానిత వ్యక్తులను విచారించి, వాహన తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా అనధికార, సరైన వాహన పత్రాలు లేని వాహనాలను శ్రీకాకుళం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక ఆటో, ఒక కారు, 18 ద్విచక్ర వాహనాలను, సోంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఐదు ద్విచక్ర వాహనాలు, మెళియపుట్టి పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు ఆటోలు, ఏడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.

అన్నదాతా సుఖీభవకు

5,87,444 రికార్డులు పరిశీలన

- ఖరీఫ్‌లో 4,07,488 ఎకరాల్లో పంటల సాగు
- 40,596 క్వింటాల విత్తనాలను సిద్ధం చేస్తున్నాం
- వ్యవసాయ శాఖ జెడి కె.త్రినాథస్వామి

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో అన్నదాత సుఖీభవ కోసం అర్హులైన రైతుల రికార్డుల పరిశీలన ప్రక్రియ పూర్తి చేశామని వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ కె.త్రినాథస్వామి అన్నారు. ఇప్పటివరకు 5,87,444 మంది రైతులకు సంబంధించిన రికార్డులను పరిశీలించామని తెలిపారు. ప్రభుత్వ పరిశీలన కోసం ఉన్నతాధికారులకు వీటిని నివేదించామని చెప్పారు. రాష్ట్రస్థాయిలో అర్హుల గుర్తింపు జాబితా రూపొందించిన తర్వాత వాటి పరిశీలనకు జిల్లాకు పంపిస్తారని తెలిపారు. ఆ తర్వాత రైతుల నుంచి కెవైసి వివరాలు తీసుకుంటామని వివరించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాలో అన్ని రకాల పంటలు కలిపి 4,07,488 ఎకరాల వేయాలని లక్ష్యంగా నిర్ణయించామని, ప్రధానమైన వరి పంటను 3,76,773 ఎకరాల్లో రైతులు సాగుచేస్తారని అంచనా వేస్తున్నామన్నారు. వీటితోపాటు విత్తనాలు ఎరువులు, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు వ్యవసాయ యాంత్రీకరణ తదితర అంశాలపై ముఖాముఖిలో 'ప్రజాశక్తి'కు వివరించారు.



? అన్నదాత సుఖీభవకు జిల్లాలో ఎంతమంది రైతుల రికార్డులు పరిశీలనకు వచ్చాయి? ఎంపిక ప్రక్రియ ఎలా చేపట్టనున్నారు?

అన్నదాత సుఖీభవకు జలాల మొత్తం 5,87,444 మంది రైతులకు సంబంధించిన రికార్డులు పరిశీలనకు వచ్చాయి. వీటిని ప్రభుత్వానికి నివేదించాం. సిక్స్ స్టెప్ వెరిఫికేషన్ ద్వారా ప్రభుత్వం లబ్ధిదారులను ఎంపిక చేస్తుంది. ఆ ప్రక్రియ పూర్తయిన తర్వాత జిల్లాలో అర్హులైన రైతుల నుంచి ఈ కేవైసీ వివరాలు తీసుకుంటాం.

? ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఎన్ని ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తారని అంచనా వేస్తున్నారు. అందులో ప్రధానమైన వరి పంట సాగు లక్ష్యాన్ని ప్రభుత్వం ఎంతగా నిర్ణయించింది?

జిల్లాలో 2025 ఖరీఫ్‌లో అన్ని రకాల పంటలు కలిపి 4,07,448 ఎకరాల్లో రైతులు పంటలు వేస్తారని అంచనా వేస్తున్నాం. అందులో ప్రధానమైన వరి పంట 3, 76,773 ఎకరాల్లో సాగు లక్ష్యంగా ఉంది.

? విత్తనాల కోసం రైతుల ఇబ్బంది పడకుండా ఎటువంటి చర్యలు చేపడుతున్నారు? ఈ ఏడాది ఎన్ని క్వింటాల విత్తనాలు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు?

జిల్లాలో రైతులకు అవసరమైన, డిమాండ్ ఉన్న రకాల విత్తనాలను అందుబాటులో ఉంచుతున్నాం. జిల్లాకు ఈ సంవత్సరం 40,596 క్వింటాల విత్తనాలు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాము. ఇప్పటికే జిల్లాకు వచ్చిన 12 వేల క్వింటాలు విత్తనాలను రైతు సేవా కేంద్రాలకు తరలించారు.

? జిల్లాలో ఎరువులు సమస్య తలెత్తకుండా ఇటువంటి చర్యలు తీసుకోమన్నారు ?

ఎరువుల కోసం రైతుల ఇబ్బంది పడకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్న. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు అన్ని రకాల ఎరువులు కలిపి 69, 050 మెట్రిక్ టన్నుల అవసరమనే ప్రభుత్వానికి ప్రతిపాదన పంపాము. ఇందులో 42,225 మెట్రిక్ టన్నుల యూరియా, 17,206 మెట్రిక్ టన్నుల డిఎపితో పాటు ఇతర రకాల ఎరువుల కోసం ప్రతిపాదనలు పంపించాం.

? జిల్లాల ఈ ఏడాది ఎంత మంది కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డులు జారీ చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటివరకు ఎంతమందికి అందించారు?

జిల్లాలో ఈ ఏడాది 9,800 మందికి సిసిఆర్‌సి గుర్తింపు కార్డులో ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించాం. ఇప్పటివరకు 500 మందికి పైగా కార్డులు అందజేశాం. గతేడాదే 9450 మందికి కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా 9700 మందికి అందించాం.

? వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా రైతులకు ఏయే పరికరాలను అందించారు? భౌతిక, ఆర్థిక లక్ష్యాలు వివరాలను చెప్పగలరు?

వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా రైతులకు రొటోవేటర్లు ట్రాక్టర్లను ఉపయోగించి వాడే యంత్ర పరికరాలు, బ్యాటరీ స్ప్రేయర్లు పవర్ వీడర్లు, బ్రష్ కట్టర్లు వంటి పరికరాలను అందించాం. జిల్లాలో రూ.287.20 లక్షల విలువ కలిగిన 1773 యూనిట్లను అందించాలని లక్ష్యంగా నిర్ణయించాం. ఇప్పటివరకు రూ.207.09 లక్షల విలువ కలిగిన 1397 పరికరాలను పంపిణీ చేశాం.

ప్రమాదాలు జరగకుండా ఎత్తులో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ఎత్తులో పెట్టిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

లావేరు: మండలంలోని తాళ్లవలస పంచాయతీ బొడ్డపాడులో మే 24న గ్రామంలో తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అదే గ్రామానికి చెందిన కాలారి నారాయణరావుకు చెందిన పాడి ఆవు విద్యుత్ ట్రాన్‌ఫార్మర్‌కు తాకి మృత్యువాత పడిన విషయం తెలిసిందే. విద్యుత్ శాఖాధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఆవు మృతి చెందిందని ప్రజాశక్తిలో కథనం వెలువడింది. దీంతో స్పందించిన జిల్లా విద్యుత్‌శాఖ అధికారులు తక్కువఎత్తులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎత్తులో విద్యుత్ స్తంభాలపై ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రజాశక్తికి కృతజ్ఞతలు తెలిపారు.

మాట్లాడుతున్న సూరయ్య

సమ్మెను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

జులై 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కెసూరయ్య పిలుపునిచ్చారు. మండలంలోని చాపర సిఐటియు కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లేబర్ కోడులను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంస్థలను ప్రయివేటీకరణ విరమణ, స్కీమ్‌ల్లో పనిచేసే వారిని కార్మికులుగా గుర్తించాలన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం అందజేయాలన్నారు. లేబర్ కోడ్లను అడ్డుకోవడం ప్రధాన అంశమని అన్నారు. కార్యక్రమంలో మండల కళాసీ సంఘ అధ్యక్షులు దారపు దామోదర్, సిఐటియు నాయకులు ఉమామహేశ్వరరావు, నారాయణ, నిరంజన్, సింహాచలం, సంపత్, మల్లేష్ పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతుల్లో సాగుపై దృష్టి

ప్రజాశక్తి- పోలాకి

రైతుల కోసం ప్రభుత్వం చేపట్టిన వికసిత కృషి సంకల్ప అభియాన్‌ను సద్వినియోగం చేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్ర వేత్త డాక్టర్ వి.హరికుమార్ సూచించారు. మండలంలోని ఈదులవలసలో కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయశాఖ ఆధ్వర్యాన రైతులకు ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధునిక పద్ధతుల్లో సాగు చేయడం వల్ల దిగుబడి పెరుగుతుందన్నారు. అలాగే పెట్టుబడి తక్కువ పెట్టి ఆదాయాన్ని పెంచే తోట పంటలపై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో కె.సునీత, ఢిల్లీశ్వరరావు, వెంకటేష్, రఘువర్మ రైతులు పాల్గొన్నారు.

బూర్జ: మండలంలోని గుత్తావల్లిలో ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయశాఖ సమన్వయంతో 'వికసిత కృషి సంకల్ప అభియాన్' కార్యక్రమం నిర్వహించారు. ఖరీఫ్ పంట కాలాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులకు విత్తనాల ఎంపిక, వాటి లభ్యత, వ్యవసాయ అనుబంధ రంగాల్లో ముందస్తు చర్యలపై అవగాహన కల్పించారు. గ్రామ సర్పంచ్ హనుమంతు గోవిందరాజులు, లాభం గ్రామ సర్పంచ్ ప్రతినిధి పప్పల రామచంద్రరావు ఈ కార్యక్రమంలో పాల్గొని రైతుల సమస్యలను వెల్లడించారు. మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ సిహెచ్ బాలకృష్ణ మాట్లాడుతూ మహిళలు, యువత కేంద్రం అందించే శిక్షణ కార్యక్రమాల ద్వారా వ్యాపారవేత్తలుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక రైతులు, వ్యవసాయ విస్తరణ అధికారి కృష్ణారావు, మత్స్య శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఖగేశ్వరరావు దంపతులకు సన్మానిస్తున్న డిఇఒ తిరుమల చైతన్య

సేవలే గుర్తింపునిస్తాయి

కోటబొమ్మాళి: ఏ ఉపాధ్యాయుడైన విద్యార్థులకు అందించిన సేవలే గుర్తింపు నిస్తాయని డిఇఒ ఎస్.తిరుమల చైతన్య అన్నారు. మండలంలోని కురుడు జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేసిన ఖగేశ్వరరావు ఉద్యోగ విమరణ పొందారు. ఈ సందర్భంగా నిర్వహించిన సన్మానసభలో పాల్గొన్నారు. ఖగేశ్వరరావు ఎంతో మంది విద్యార్థులకు ఉన్నత స్థాయిలోకి తీసుకెళ్లారని అన్నారు. అనంతరం ఖగేశ్వరరావు దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటి డిఇఒ విలియన్స్, ఎంఇఒ ఎల్.వి.ప్రతాప్, ఉపాధ్యాయులు సనపల కరుణ్‌కుమార్, డి.గోవిందరావు పాల్గొన్నారు.

సంతోష్‌కు సన్మానం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపాలిటీ పరిధిలోని 17 వార్డు టిడిపి ఇన్‌ఛార్జి జన్నెల సంతోష్‌కి లాలాపేట ప్రజలు ఆదివారం సన్మానించారు. ఇటీవల నిర్వహించిన అమ్మవారు సంబరాల్లో సంతోష్ అందించిన సహకారంతో కార్యక్రమం విజయవంతంగా పూర్తయిందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు టెంక ఈశ్వరరావు, లావేటి రామారావు, మందల బాలు, బైర్‌రెడ్డి విజయ్, పైల నారాయణ, వంశి, మడ్డు శ్యామ్, పైలా గిరి, కోటి పాల్గొన్నారు.

సిరిమానుకు సౌకర్యాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

సిరిమానోత్సవాలకు అన్ని సౌకర్యాలు సిద్ధం చేస్తామని, అంగరంగ వైభవంగా సిరిమానోత్సవం జరగాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక కొత్తపేట నుంచి జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంతాల వరకు కాలువాల వ్యవస్థ, శానిటైజింగ్, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ అంతరాయాలు, ప్రమాద అవకాశాలపై క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులకు ఆదివారం ఎమ్యెల్యే పలు సూచనలు చేశారు. అనంతరం పోలమ్మతల్లి దేవాలయానికి వెళ్లి దర్శనం చేసుకొని, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్, విద్యుత్ శాఖ ఎఇ, డిఇఇ ఇతర అధికారులతో సిరిమానోత్సవాలకు భక్తుల సౌకర్యాలపై తీసుకోవాల్సిన బాధ్యతలను, తాగునీటి సౌకర్యం, కాలువాల పరిశుభ్రత వంటి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మాదారపు వెంకటేష్, కొత్తపేట గ్రామస్తులు, అధికారులు, మున్సిపల్ సిబ్బంది, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

వీరులకు సలామ్..

కవిటి: ఆపరేషన్ సిందూరులో పాల్గొని స్వగ్రామానికి చేరుకున్న సైనికులు పొల్లాయి మోరేసు విజయ్, పులకల రమేష్ ను తమ సామాజిక తరగతి చెందిన నాయకులు కవిటిలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అగ్నికుల క్షత్రియ నాయుడు పొల్లాయి లక్ష్మణమూర్తి మాట్లాడుతూ దేశ సేవలో ప్రాణాలు సైతం ఫణంగా పెట్టి పోరాడిన సైనికులను సన్మానించుకోవడం తమ కర్తవ్యమని అన్నారు. యువత వీరిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సింహాచలం, దేవరాజు, కృష్ణ, పురుషోత్తం, లోజనాథం, నీలాచలం, పులకల వెంకటరావు, తెప్పల మోహనరావు, గోరకల రామారావు, పొల్లాయి పాపారావు, పొల్లాయి ఉమాపతి, జుత్తు దశ, పి.దానయ్య, కాంతారావు, చిరంజీవి పాల్గొన్నారు.

తప్పుల తడకగా భూముల రీ సర్వే

- కార్యాలయం చుట్టూ తిరుగుతున్న రైతులు
- చేతివాటం చూపిస్తున్న సిబ్బంది
- ఉన్నత అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం

గత ప్రభుత్వం భూముల రీ సర్వే కార్యక్రమాల ద్వారా సొంత భూమి యజమానులకు భూములను అప్పగించే విధంగా చర్యలు చేపట్టేందుకు భూముల రీ సర్వే కార్యక్రమాన్ని చేపట్టింది. రెవెన్యూ శాఖ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో సొంత భూమి యజమానులకు తీవ్ర ఇబ్బందులు ఎదురైన పరిస్థితి తలెత్తింది.

ప్రజాశక్తి- బూర్జ

గత ప్రభుత్వం భూమి యజమానులకు మేలు జరుగుతుందన్న ఉద్దేశంతో అమలు చేసిన భూముల రీ సర్వే కార్యక్రమం భూ యజమానులకు మరిన్ని అవస్థలు కలిగించేలా మారింది. మండలంలోని లచ్చయ్యపేట రెవెన్యూ గ్రామంలో 2023లో నిర్వహించిన భూముల రీ సర్వేలో సుమారు 80 శాతం డేటా తప్పుగా నమోదు చేశారని గ్రామ రైతులు పేర్కొన్నారు. ఈ రీ సర్వేలో వంశధార, నాగావళి అనుసంధాన కెనాల్ పక్కన ఉన్న 220 ఎల్‌పిఎం మ్యాపులు ఎక్స్‌ఎల్‌లో తప్పుగా నమోదు చేశారని రైతులు వాపోతున్నారు. ఇందులో 120 ఎల్‌పిఎంలు తప్పు జాయింట్ పట్టాగా నమోదు చేశారని, మరికొన్ని ఎల్‌పిఎంలు భూమి యజమానివి కాదని మిగులు భూమిగా నమోదు చేసి రెవెన్యూ శాఖ వారికి అనుకూలంగా ఉన్నవారి పేరున నమోదు చేస్తున్నారని ఆరోపించారు. ఎల్‌పిఎంలను గయా భూములుగా నమోదు చేశారని అన్నారు. 1110 ఎల్‌పిఎంలకు కేవలం 27 మందికి కొనుగోలు భూములని ఎంట్రీ చేశారని, సుమారు 600 కొనుగోలుగా ఎంట్రీ చేయలేదని రైతులు వాపోతున్నారు. ఈ విషయాన్ని అప్పటి జాయింట్ కలెక్టర్ నవీన్ దృష్టికి తీసుకురాగా ఆయన స్పందించి 60 ఎల్‌పిఎంలను అలాగే మరో 20 అడంగళ్లను రైట్ ఎంట్రీ చేశారని, ఈ సందర్భంగా సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారని అలాగే 9 మందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టంగా రాశారని రైతులు పేర్కొన్నారు. ఇంకా 70 శాతం రికార్డులను కరెక్ట్ చేయాల్సి ఉన్నప్పటికీ జాయింట్ కలెక్టర్ బదిలీ కావడంతో పెండింగ్‌లోనే ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయాన్ని గ్రామసభకు విచ్చేసిన ఎమ్మెల్యే రవికుమార్ దృష్టికి తీసుకురాగా ఫలితం శూన్యమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముడుపులు చెల్లించాల్సిందే....

తప్పులు తడకగా ఉన్న భూముల వివరాలను సరిదిద్దేందుకు రెవెన్యూ శాఖ సిబ్బందికి ముడుపులు చెల్లించాల్సి వస్తుందని రైతులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం రెవెన్యూ శాఖలో భూముల వివరాలకు లాక్‌లు వేయడం, ఒకరి భూములను వేరొకరి పేరుగా మార్చడం వంటివి చేసి వాటిని సరిదిద్ద డానికి పెద్ద మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ఫలితం శూన్యమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మండలంలో జరుగుతున్న రెవెన్యూశాఖ అవకతవకలపై విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై వివరణ కోసం తహశీల్దార్ వై.వి.పద్మావతి, శ్రీకాకుళం ఆర్‌డిఒ సాయి ప్రత్యూషలను ఫోన్‌లో సంప్రదించే ప్రయత్నం చేయగా అందుబాటులో లేరు.

అవకతవకలపై దృష్టి సారించాలి

రెవెన్యూ శాఖలో జరుగుతున్న అవకతవకలపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా రెవెన్యూ సిబ్బంది వలన తీవ్ర అవస్థలకు గురవుతున్నాం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలి

- సవిరిగాపు నీలకంఠం, రైతు, లచ్చయ్యపేట

గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు

నౌపడ : సంతబొమ్మాళి మండల కేంద్రంలోని సంతబొమ్మాళి, నౌపడశాఖ గ్రంథాలయంలో అధికారులు రామకృష్ణ, రూపవతి ఆధ్వర్యాన వేసవి విజ్ఞాన శిబిరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చదువులతో పాటు ఆటలు అవసరమని వివిధ రకాల ఆటలును ఆడించారు. విద్యార్థులు చదువుతోపాటు, ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని కోరారు. కార్యక్రమంలో హెల్పర్ ప్రసాద్, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

రేపట్నుంచి పెద్దమ్మ తల్లి ఉత్సవాలు

వజ్రపుకొత్తూరు: ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు కొమరల్తాడలో పెద్దమ్మ తల్లి గ్రామదేవత ఉత్సవాలు ప్రారంభమవుతాయని గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వివిధ పగటి వేశాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళలు, యాత్రికులు, పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

సంప్రదాయాలను కొనసాగించాలి

శ్రీకాకుళం: భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలను, కళలను కొనసాగించాలని అవి మన భావితరాలకు అందిచడం మన బాధ్యతని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. విద్యార్థి దశ నుంచే కళారంగాలపై మక్కువ పెంచుకోవాలని, చదువుతో పాటు అన్ని రంగాల్లో విద్యార్థులు మెలకువలను నేర్చుకుని, జీవిత గమ్యాలను చేరుకోవాలన్నారు. స్థానిక కలెక్టర్ బంగ్లా ఎదురుగా చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ సభ్యుల బృందం గత 35 ఏళ్లుగా ఉచిత వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహించటం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో నటుకుల మోహన్, పర్యవేక్షకులు ఎల్. నంది కేశ్వరరావు, బి.ఎం.ఎస్. పట్నాయక్, నిక్కు హరి సత్య నారాయణ, శిక్షకులు సాయిప్రసాద్, నృత్య శిక్షకులు డా. నీరజా సుబ్రహ్మణ్యం, జోన్ చైర్మన్ పొన్నాడ రవికుమార్, డిసి. బి.దేవభూషణం, నూతన అధ్యక్షులు డా. పైడి. సిందూర, టెక్కమ్ రాంగోపాల్, బి. విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

మినీ ట్రాన్స్‌పోర్టు యూనియన్ గౌరవాధ్యక్షునిగా శ్రీకాంత్

పలాస: కాటమ్మతల్లి మినీ ట్రాన్స్‌పోర్టు యూనియన్ గౌరవాధ్యక్షునిగా దువ్వాడ శ్రీకాంత్ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో దువ్వాడ శ్రీకాంత్‌ను గౌరవాధ్యక్షునిగా సంఘ సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలాస నియోజకవర్గంలో ఉన్న మినీ ట్రాన్స్‌పోర్టు కార్మికులు, వాహన యజమానులు ఐక్యతతో ఉండి సంఘం అభివృద్ధికి సహకరించాలన్నారు. ప్రజాసేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని కోరారు. అధ్యక్షులు జనా మోహన్, వైస్ ప్రెసిడెంట్ అడపా మేఘనాథ్, సెక్రటరీ పిట్టా రాజేష్, సనపల అమ్ములు పాల్గొన్నారు.

షెల్టర్ లేక ప్రయాణికుల ఇబ్బందులు

నందిగాం : మండల కేంద్రమైన నందిగాంలో ప్రయాణికులకు బస్సు షెల్టర్ లేక ఇబ్బందులు పడుతున్నారు. నందిగాం, బెజ్జిపల్లె, పెంటపూరు, బడబంద, శివరాంపురం పరిసర గ్రామాల నుంచే పలాస, టెక్కలి, శ్రీకాకుళం, విశాఖ వెళ్లేవారు కూడా ఆరుబయట ఎండలోనే నిరీక్షించాల్సి వస్తుంది. ప్రయాణికులు ఎండలో ఎండుతూ, వానలో తడుస్తూ ప్రయాణం సాగిస్తుంటారు. దుకాణాలు అండర్ పాస్ వంతెనలో తలదాచుకుంటూ బస్సుల కోసం నిరీక్షిస్తుంటారు. అధికారులు చొరవ చూపే ప్రయాణికులకు అవసరమైన చోట నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఎండలో బస్సు కోసం చూస్తున్న ప్రయాణికులు

మాజీ ఎమ్మెల్యేను కలిసిన సత్యంనాయుడు

ప్రజాశక్తి- రణస్థలం

వైసిపి అధ్యక్షులు, మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైసిపి రాష్ట్ర యువజన సంయుక్త కార్యదర్శి పిన్నింటి సత్యంనాయుడు నియమితులైన సందర్భంగా ఆదివారం రణస్థలం పార్టీ కార్యాలయంలో ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే, సమన్వయకర్త గొర్లె కిరణ్ కుమార్‌ని మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం వైసిపి రాష్ట్ర యువజన సంయుక్త కార్యదర్శి పిన్నింటి సత్యంనాయుడుని దుశ్శాలువతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన వారికి తగిన గుర్తింపు నిస్తుందని, పార్టీకి అందరూ కష్టపడి పనిచేసి పార్టీని మరింత బలోపేతం దిశగా అడుగులు వేయాలని సూచించారు. పిన్నింటి సత్యంనాయుడు భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రణస్థలం మండల పార్టీ అధ్యక్షులు గొర్లె శ్రీనివాసరావు, జి.సిగడాం వైసిపి మండల అధ్యక్షులు డోల వెంకట రమణ, ఎంపిపి ప్రతినిధి మీసాల వెంకటరమణ, ఎచ్చెర్ల నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు దన్నాన హరి పాల్గొన్నారు.

సత్యంనాయుడును సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే

వజ్రపుకొత్తూరు : కలుసుకున్న పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' కలయిక

వజ్రపుకొత్తూరు: మండలంలోని అక్కుపల్లి హైస్కూల్లో 1984-85 విద్యాసంవత్సరంలో పదో తరతగతి చదువుకున్న విద్యార్థులు 40 ఏళ్ల తరువాత ఒకచోటకు చేరి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆదివారం అక్కుపల్లి పాఠశాలలో అపూర్వకలయిక కార్యక్రమం నిర్వహించారు. వీరంతా వివిధ హోదాల్లో ఉన్నా.. చిన్నపిల్లలు వలే ఒకరునొకరు ఆటపట్టిస్తూ సరదగా గడిపారు. చదవుకున్న రోజుల్లో చేసిన చిలిపి పనులు, అల్లర్లు కోతికొమ్మచ్చి ఆటలు, ఉపాధ్యాయలకు ఒకరుపై నొకరు ఫిర్యాదులు చేసుకొన్న వైనం గుర్తు చేసుకొని సందడి చేశారు. వివిధ కారణాలతో మృతిచెందిన మిత్రులకు సంతాపం తెలియజేశారు. ఉపాధ్యాయులకు పిలిచి ఘనంగా సన్మానించారు.

పలాస : కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989-1990 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 35 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కాశీబుగ్గలోని ఓ ప్రయివేట్ ఫంక్షన్ హాల్‌లో కలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. జామి కృష్ణారావు, కుమార్ స్వామి, అనిల్‌రాజ్, మల్లేశ్వరరావు, శ్రీనివాసరావు, డానియల్, ప్రసాద్, బి.హరికృష్ణ, శ్రీనివాస్ పాండా, చక్రి, ఎస్.లక్ష్మి, వాగ్దేవి, అరుణ, దానమ్మ పాల్గొన్నారు.

మూడు దశాబ్దాల 'ముచ్చట్లు'

ప్రజాశక్తి- కవిటి

సమయం ఎంత వేగంగా సాగిపోతుందో తెలియదు... కానీ, కొన్ని జ్ఞాపకాలు మాత్రం కాలానికి అతీతంగా నిలిచిపోతాయి. అలాంటి జ్ఞాపకాలే మళ్లీ ఒక్క చోట చేరాయి. అదీ మూడున్నర దశాబ్దాల తర్వాత కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో. 1992-93, 1993-94, 1994-95 విద్యా సంవత్సరాల్లో పదో తరగతి పూర్తి చేసిన మూడు సమూహాలు ఆదివారం మళ్లీ కలుసుకున్నాయి. ఆ రోజుల్లో చెప్పుకున్న మాటలు ఈరోజు మళ్లీ పలికాయి. ఈలోగా ఓ బెంచ్ మీద కూర్చుని 'ఇక్కడే కూర్చునేవాణ్ణి' అన్నాడు ఒకడు. 'నన్ను ఇక్కడే మాస్టారు బలంగా బాదాడు' అన్నాడు మరొకడు. అలా ఒక్కో మాట ఒకో జ్ఞాపకాన్ని నిద్రలేపింది. వార్షికోత్సవాల్లో వేసిన నాటకాలు, మామిడి తోటల్లో ఆడిన ఆటలు, రమణమూర్తి మాస్టారి బెత్తం దెబ్బలు, హీరోలను తలపించే ఆనంద్ రెడ్డి మాస్టారి అనుకరణ, క్లాస్‌లో ఫస్ట్ వచ్చినపుడు అందరూ కొట్టే చప్పట్లు, సూర్యనారాయణ మాస్టారి ఆశువు పద్యాలు, మోహనరావు మాస్టారి సమ్మోహనమైన ప్రసంగం మళ్లీ ఈ కలయికలో ప్రతిధ్వనించాయి. వాటన్నిటినీ గుర్తుచేసుకుంటూ నాటి గురువులు రమణమూర్తి, ఆనందరెడ్డి, మోహనరావు, పి.ఎం. సూర్యనారాయణ, ప్రభాకరరావు, విశ్వనాథం మాస్టార్లకు అంతా కలిసి సన్మానించి సాష్టాంగ నమస్కారం చేశారు. సాయంత్రానికి అందరూ కలిసి ఒక గ్రూప్ ఫొటో తీసుకున్నారు. కానీ, ఆ అందులో కనిపించింది ఫొటో మాత్రమే కాదు. ఒక కాలంం ఒక తరం ఒక అనుబంధం కూడా. ఈ కలయికతో కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణం ఒక్కసారి తిరిగి 1990ల దశకంలో ఓలలాడింది.

ఆత్మీయ కలయికలో ఆనందంగా...



నరసన్నపేట టీంకు ప్రైజ్‌మనీ కప్‌ను అందజేస్తున్న రవికుమార్

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

ఆమదాలవలస: క్రీడలతో యువతీ యువకులకు ఉజ్వల భవిష్యత్ ఉందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న సిఎంసిసి ఎమ్మెల్యే కప్ విజేతలకు బహుమతుల ప్రధాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఫైనల్‌లో విజేతగా నిలిచిన నరసన్నపేట టీంకు రూ.30 వేలు ప్రైజ్‌మనీ కప్‌ను అందజేశారు. రన్నర్‌గా నిలిచిన సిక్కోలు చీటా టెక్కలి టీంకు రూ.20 వేలు ప్రైజ్ మనీ షీల్డ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడాకారులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని అన్నారు. క్రీడలతో యువతి, యువకులు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ తరపున జూనియర్ కళాశాల మైదానంలో 3 టర్ఫైన్ క్రికెట్ పిచ్ లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పట్టణంలో తొందరలోనే కళాకారులకు ఆడిటోరియం వాకింగ్ ట్రాక్ లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. సిఎంసిసి క్రికెట్ అసోసియేషన్ తరపున ఎమ్మెల్యే రవికుమార్‌కు మెమొంటోను అందజేశారు. కార్యక్రమంలో సిఎంసిసి క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు తమ్మినేని విద్యాసాగర్, క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి హసన్ రాజా, జాయింట్ సెక్రెటరీ బెనర్జీ, ఎలియాస్, నారా ఈశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీత, టిడిపి నాయకులు నూక రాజు, బోర గోవిందరావు, నాగళ్ళ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

పలాస : ఈ నెల 4న చేపట్టనున్న వెన్నుపోటు దినం ర్యాలీని విజయవంతం చేయాలని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, జిల్లా పరిశీలకులు, ఎమ్మెల్సీ కుంభ రవిబాబులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం వైసిపి కార్యాలయం ప్రగతి భవన వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉదయం పది గంటలకు గంటలకు కాశీబుగ్గ బస్టాండ్ ఎదురుగా ఉన్న వైఎస్ఆర్ విగ్రహం నుండి వెన్నుపోటు దినం నిరసన ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం రెవెన్యూ డివిజనల్ అధికారికి వినతిపత్రం సమర్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు హనుమంతు వెంకటరావు, పైల చిట్టిబాబు, శ్రీనివాసరావు, హేమేశ్వరరావు పాల్గొన్నారు.

నరసన్నపేట : కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాదిలో హామీలే మిగిలేయని పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. ఈ నెల 4న నిర్వహించనున్న వెన్నుపోటు దినం పోస్టర్‌ను స్థానిక వైసిపి కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ అధినేత వై.ఎస్.జగన్ ఇచ్చిన పిలుపుతో వెన్నుపోటు దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చంద్రబాబు రాజకీయ జీవితం వెన్నుపోటుతోనే మొదలయ్యిందన్నారు. నేటి చంద్రబాబు పాలనతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలు ఇప్పటి వరకు ఒక్కటీ అమలు చేయలేకపోయిన దుస్థితి నేడు నెలకుందని విమర్శించారు. వెన్నుపోటు పొడవడంలో ఆయనకు ఎవరు సారిలేరని చురకలు అంటించారు. కార్యక్రమంలో ఎంపిపి ముద్దాడ భైరాగినాయుడు, కరిమి రాజేశ్వరరావు, బగ్గు రామకృష్ణ, ఎంపిపి ఆరంగి మురళీధర్, ఎంపిపి వాన గోపి, చింతు రామారావు పాల్గొన్నారు.

'వెన్నుపోటు' పోస్టర్ల ఆవిష్కరణ

కొత్తూరు: ఈ నెల 4న నిర్వహించనున్న వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలని ఎంపిపి సవర సావిత్రి కోరారు. ఈ మేరకు స్థానిక వైఎస్ఆర్ విగ్రహం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బిసి సెల్ కార్యదర్శి దూల అప్పన్న, కురిగాం సర్పంచ్, సీపాన అశోక్‌కుమార్, సవర రమేష్, లబ్బ సర్పంచ్ టి.తులసి, నియోజకవర్గ ఎస్‌టి సెల్ సవర సింహాద్రి, ప్రధాన కార్యదర్శి బి.నగేష్, జగన్ పట్నాయక్ పాల్గొన్నారు.

పలాస : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళిలో వెన్నుపోటు పోస్టర్‌ను వైసిపి మండల అధ్యక్షులు సంపతిరావు హేమసుందరరాజు పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు దుబ్బ వెంకటరావు, బొడ్డు అప్పన్న పాల్గొన్నారు.

రణస్థలం: స్థానిక పార్టీ కార్యాలయంలో వెన్నుపోటు దినం పోస్టర్‌ను నియోజకవర్గం నాయకులతో కలిసి ఆదివారం ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే, సమన్వయ కర్త గొర్లె కిరణ్‌కుమార్ ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో ప్రజలు, వైసిపి నాయకులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

ప్రపుల్ల పాడి (ఫైల్)

కవిటి: మండలంలోని రాజపురం పంచాయతీ మాజీ సర్పంచ్, ప్రపుల్ల ఫాడి (90) ఆదివారం మృతి చెందారు. 90వ దశకంలో ఇచ్ఛాపురం నియోజక వర్గంలోనే కాకుండా ఆంధ్రా, ఒడిశా గ్రామాల్లో సిద్ధాంతిగా పేరు పొందిన ప్రపుల్ల ఫాడి, తన స్వగ్రామమైన రాజపురం పంచాయతీ సర్పంచ్‌గా అమూల్యమైన సేవలు అందించారు. ఆయన కుమారుడు సత్యనారాయణ ఫాడి ఒడియా మైనారిటీ సంఘం అధ్యక్షునిగా ఉన్నారు. ప్రపుల్ల ఫాడి మతిపై ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి లోల్ల రాజేష్, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

విసిగిస్తున్న విద్యుత్ కోతలు

టెక్కలి: టెక్కలి పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ కోతలు వినియోగదారులను విసిగిస్తున్నాయి. రోజూ నిర్విరామంగా గంటల కొద్దీ విద్యుత్ కోతలు అమలు కావడంతో ప్రజలు, దుకాణదారులు, వ్యాపారస్తులు అసహనానికి గురవుతున్నారు. ముందస్తు సమాచారం లేకుండా కోతలు విధించడంతో కనీస అవసరాలు తీసుకోలేని పరిస్థితి ఎదురవుతుందని వినియోగదారులు వాపో తున్నారు. ముందస్తు సమాచారం లేకపోవడం వల్ల గృహ అవసరాలకు కావాల్సిన ఏర్పాట్లు చేసుకొలేక పోతున్నామని అంటున్నారు. నిరంతరంగా గంటల పాటు కోతలు విధిస్తున్నారు.

పతకాలు సాధించిన విద్యార్థులు

రణస్థలం విద్యార్థుల ప్రతిభ

రణస్థలం: 11వ రాష్ట్ర స్థాయి పేన్ కాట్ సిలాట్ పోటీలు ఆదివారం ఆంధ్రా యూనివర్సిటీ విశాఖ పట్నంలో జరిగాయని రణస్థలంకు చెందిన కరాటే గురువు లింగాల ఈశ్వరారావు తెలిపారు. ఈ పోటీలకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో శిక్షణ పోందుతున్న శ్రీ పరశురాం యుద్ధ కళా క్షేత్రంకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో ఎంపికైనట్లు తెలిపారు. ఈ పోటీల్లో 15 మంది విద్యార్థులు పాల్గొని పది బంగారు పతకాలు, మూడు సిల్వర్ పతకాలు, రెండు బ్రాంజ్ పతకాలు సాధించి నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు పలువురు అభినందించారు.

సన్మానిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనది

పోలాకి: సమాజంలో గౌరవ ప్రదమైన మహోన్నతమైనది ఉపాధ్యాయుని స్థానమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని గొల్లలవలస ప్రాథమిక పాఠశాలలో ఉద్యోగ విరమణ పొందిన కాతాల ఎర్రంనాయుడు మాస్టారు సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రంనాయుడు దంపతులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు డోల జగన్, ఎం.వెంకట అప్పలనాయుడు, రోణంకి కృష్ణం నాయుడు, సూరపు నారాయణదాసు, పంచిరెడ్డి సింహాచలం, వైసిపి నాయకులు కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు ఉపాధ్యాయులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

యామలపేటలో పారిశుధ్య పనులు

నౌపడ : సంతబొమ్మాళి మండలం యామలపేటలో సర్పంచ్ ప్రతినిధి ముదిలి సంజీవ్ ఆధ్వర్యాన ఆదివారం ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి కేశవరావు పర్యవేక్షణలో పారిశుధ్య సిబ్బంది ప్రొక్లెయినర్‌తో కాలువల్లోని పూడికలు తొలగించి ట్రాక్టర్ల ద్వారా తరలించారు. అనంతరం కాలువల్లో బ్లీచింగ్ చల్లించారు. టిడిపి నాయకులు లోపింటి రామిరెడ్డి పాల్గొన్నారు.

'కిల్లి' దంపతులు పరామర్శ

కోటబొమ్మాళి: మండలంలోని జీయన్నపేటకు చెందిన మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు ఇటీవల పోలీసులు కాల్పుల్లో హతమయ్యారు. విషయం తెలుసుకున్న కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, డాక్టర్ రామ్మోహన్‌రావు, కేశవరావు కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భం గా కేశవరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అలాగే పలువురు కేశవరావు చిత్రపటానికి పూలమాలలు వేశారు.

మింత్రా నుంచి ఇఒఆర్ఎస్ ప్రారంభం

శ్రీకాకుళం: భారతదేశంలోని ప్రముఖ ఫ్యాషన్, సౌందర్యం, జీవనశైలి ఉత్పత్తులకు గమ్యస్థానాల్లో ఒకటైన మింత్రా నగరంలో ఇఒఆర్ఎస్ తన ఫ్లాగ్‌షిప్ ఎండ్ ఆఫ్ రీజన్ సేల్‌ను పెదపాడు షోరూంలో ఆదివారం ప్రారంభించింది. ఈ సందర్భంగా మింత్రా స్టోర్‌లో జరిగిన ఆవిష్కరణ కార్యక్రమంలో మింత్రా ఉత్తరాంధ్ర రీజియన్ రెవెన్యూ గ్రోత్ హెడ్ భారత్ కుమార్ మాట్లాడుతూ మింత్రా 22వ ఎడిషన్‌ను కొనసాగిస్తోందని, ఫ్యాషన్ ప్రియులందరూ ఎంతో ఆసక్తిగా వేచి చూస్తున్న ఈ షాపింగ్ ఈవెంట్ దేశవ్యాప్తంగా ఫ్యాషన్, సౌందర్య ప్రియులను ఆకట్టుకుంటోందన్నారు. మెట్రో, భారీ నగరాల నుంచి (టైర్ 1, టైర్ 2), అభివృద్ధి చెందుతున్న నగరాలకు చెందిన కొనుగోలుదారులు అంతర్జాతీయ, దేశీయ, స్వదేశీ బ్రాండ్‌లతో సహా 10 వేల కన్నా ఎక్కువ బ్రాండ్‌ల నుంచి 4 మిలియన్లకు పైగా స్టైళ్లలో విస్తృత ఎంపికను అన్వేషించుకునేందుకు మింత్రా అవకాశం కల్పిస్తోందన్నారు. ఈ ఏడాది ఇఒఆర్ఎస్ సమయంలో వినియోగదారులను ఆకట్టుకునే విభాగాల్లో పురుషుల క్యాజువల్ వేర్, పురుషుల, మహిళల ఎథినిక్ వేర్, మహిళల వెస్ట్రన్ వేర్, బ్యూటీ అండ్ పర్సనల్ కేర్, వాచీలు, వేరబుల్స్, ఉపకరణాలు, ప్రయాణ అవసరాలు, స్పోర్ట్స్ ఫుట్‌వేర్, పిల్లల దుస్తులు, వివాహ సేకరణలు ఉన్నాయన్నారు. లెవీస్, నైక్, అడిడాస్, హెచ్‌అండ్ఎం, మాంగో, లోరియల్, లాక్మే, లిబాస్, డెకాథ్లాన్, క్రోక్స్, యుఎస్ పోలో అసోసియేషన్, ప్యూమా, రేర్ రాబిట్ వంటి అనేక ప్రముఖ బ్రాండ్‌లు అందుబాటులోకి తీసుకువచ్చినట్టు చెప్పారు.